కథానిక

# అమ్మాయికి ఓ సంబంధం

చింతలపూడి వెంకటేశ్వరరావు

"త్రాను పట్టిన కుందేలుకి మూడే, కాళ్ళని బిగుసుకు కూర్చుంటే, అమ్మాయికి ఈ యుగంలో పెళ్ళయ్యే యోగం కన్పించేటట్లు లేదు."

"కళ్యాణంవచ్చినా, కక్కువచ్చినా ఆగుతుందా? మీకంగారుమీదేగాని, పెళ్ళంటేబొమ్మల పెళ్ళనుకున్నారా. ఏం? సంబంధం చూస్తే మనకు కావలసినవి ఎన్ని కలవఫలసివున్నాయో ఆలోచించవలసి వుంది. నా పెళ్లి మాత్రం అనుకున్నంత తొందరగా అయిందా ఏమిటి?"

"అమ్మ గుణాలు అమ్మాయికి కూడా అబ్బినట్లున్నాయి. అయితే యిక సంబంధం కుదిరినట్లే. అమ్మాయిని పిలు."

"కౌసల్యా!"

"వస్తున్నా! అమ్మా!"

"సిగ్గుపడకుండా చెప్పు తల్లీ."

"ఏం అమ్మా! మొన్న వచ్చిన సంబంధం నచ్చినట్లేనా?"

"అలా అడుగుతున్నారేం నాన్నా! ఆ సంబంధం నిర్ణయించే ముందు మీరు కొంచెం ఆలోచించాలి."

"అటువంటి నిక్షేపంలాంటి సంబంధానికి ఆలోచించవలసిన అవసరమేముంది? సొంతు బారు కాపులు. పందెకరాల మాగాణి, చిల్లర ములర మెట్టభాగం సుమారు ఏభై యెకరాల గడ్డ వుందట. ఇంకా పాతికెకరాలు కొబ్బరి తోట పాలకల్లుతో వుందని చెప్పారు. ఒక్కడే ఒక్క కొడుకు. ఈ కరువు రోజుల్లో అంత కన్న మంచి సంబంధం దొరకమంటే దొరుకుతుందా?"

"అవును. మీకు కావలసినవి, ధనకనక వస్తు వాహనాలు. అతని అందం విషయం, చదువు విషయం చెప్పరేం?"

"ఎందుకొచ్చిన చదువులు? బి. ఏ. లు, ఎమ్. ఏ. లు పాసయితే మాత్రం ఏం లాభం? భార్యల పోషించుకోలేని ఎంతమంది గ్రేడ్యుయేట్స్‌ను చూడటం లేదు ఈ రోజుల్లో."

"అతని అందాన్ని చూస్తే నా కెందుకో భయమేసింది నాన్నా. నల్లమనిబొగ్గులా ముఖం, బొంగ్ర ముక్కు, కోరమీసాలు. ఆ రోజు అతన్ని చూచి చెల్లి కేరుమనలేదా! అయినా వాళ్ళకు మాత్రం కొంచెమైనా జ్ఞానం ఉండక్కరలేదా. వాళ్ళు అందవికారంగా వున్నా, రంభలాంటి పిల్లలు కావాలి. ఏమైనా అంటే మగవాళ్ళు ఎంతఅందవికారంగావున్నా పర్వాలేదంటారు. నాన్న నన్ను స్కూలు ఫైనలు వరకు చదివించి, చివరకు థోర్డుక్లాసు ఆనర్స్ వానికా ఇచ్చేది?"

"నీకు బాగా చదువుకున్న వాళ్లయినా నచ్చేటట్లు లేదు. వారంరోజుల క్రితం హైదరాబాద్ నుంచి వచ్చిన యింజనీరింగు చదువుకున్న అబ్బాయిని కూడ తృణీకరించావు."

"చదువుకున్న వాడేగాని, మనిషిమాత్రం చిన్ని మేరు పర్వతంలా వున్నాడు. నావయసు చూచి తీసుకు వచ్చిన సంబంధమేనా? అతన్ని నాకిచ్చి చేస్తే ప్రజలంతా ఏమనుకుంటారో ఆలోచించారా?"

"అమ్మాయి! మా తమ్ముడు నీ కిష్టమేగా. వాడిని చేసుకో. ఎంతకైనా దగ్గరవాళ్ళం."

"అవునమ్మా తమ్ముడని అభిమానం కొద్దీ, అట్లాగ మాట్లాడుతున్నావుగాని, చూస్తూ చూస్తూ కుమార్తె గోతిలో దిగుతుంటే, ఏ తల్లిదండ్రులు ఒప్పుకుంటారమ్మా! అట్టిపోకిరీ వాడంటే నీ కిష్టమా? అడ్డమైన ఆడవాళ్ళ యింటిచుట్టూ తిరిగేవాడిని ఆ మాయకపు కాలేజీ విద్యార్థినుల వెనుక ఆడవారకపు మగాళ్ళను వెంటబెట్టుకొని వాళ్ళను ఏడ్పించేవాడిని నేను యెట్లా యిష్టపడతాను?"

"ఇదంతా నీకెట్లా తెలిసింది?"

"ఆడవాళ్ళు మగవాళ్లు అనుకున్నంత తేలి

కైనవాళ్ళు కాదు నాన్నా. ఒక పర్యాయం నేను సినిమానుంచి వస్తుంటే, నన్నొ ముందు గుర్తు పట్టలేదు కాబోలు నా వెనుక పడ్డాడు, అడ్డమైన కూతలూ కూశాడు. నాకు ఒళ్ళుమండి వెనక్కి తిరిగి చూశాను. అమ్మ చేసుకోమన్న ఆ పెండ్లి కుమారుడు నన్ను చూసి ఒకటే పరుగు. అక్కడే వుంటే చెప్పుదెబ్బలు కొట్టి, మళ్ళా ఎవర్నయినా అట్లా అనకుండా చేసేదాన్ని."

"ఆ గొడవంతా ఇప్పుడెందుకు పోనీలే!"

"అమ్మ! ముఖ్యంగా నీకే కావలసివుంది. లేపా మహనీయుడు మీ అల్లుడైతే, ఎంతగా విచారించేదానవో! పాపం! అమ్మ యింకా తమ్ముడిని బుద్ధిమంతుడనుకుంటుంది."

"అవన్నీ చిన్నతనం చిలిపి చేష్టలు. కృష్ణుడు ఎంతమంది గోపికల్ని ఏడ్పించలేదు. అట్లాగే వాడు కూడాను?"

"బావ ముద్దు కృష్ణుడు కాదు మొద్దు కృష్ణుడు. నాన్నా! అమ్మ మా బంగారు బావను మా బాగా పోల్చింది. బావకు కృష్ణుడికున్న బుద్ధులలో ఆ ఒక్క బుద్ధేనా, లేక అన్ని బుద్ధులూ వున్నాయా?"

"నీవు మరీ చెప్తావే!"

"ఎంతకైనా తమ్ముడు."

"రాఘవయ్యగారూ"

"చూడు, ఎవరో బయటనుంచి పిలుస్తున్నట్లున్నారు."

"ఇంకెవరు? పెళ్ళిళ్ళ పేరయ్యగారు."

"నీవు అమ్మని లోపలికి తీసుకొని వెళ్ళు"

"పేరయ్యగారో రండి. లోపలకు రండి చాలకాలానికి కన్పించారు. ఈమధ్య బొత్తిగా అయిపులేదు."

"ఒక బిజినెస్సా మనకి. చిన్నచిన్న బిజినెస్సులు చాలా వుంటాయని మీకు తెలుసుగా. ఈ మధ్య అగ్గసర్లు ఎక్కువయ్యాయి. బేరం కాస్త జోరుగానే తగులుతూంది. బయట మన ఊళ్లో సబ్ కలక్టరుగా రబ్బాయిని తీసుకొని వచ్చాను. కారులోనే వున్నాడు"

"బయటే వుంచేసారేం. లోపలకి తీసుకు రండి. నేను వస్తున్నా పదండి."

"అమ్మాయీ పెళ్ళివార్లు వచ్చినట్లున్నారు పెళ్ళి చూపుల వేషం వేయి తల్లీ."

"అబ్బ! ఈ వేషాలు వేయలేక నా ప్రాణాలు సగం పోతున్నాయి? ఎందుకొచ్చిన బురకా వేషాలు. సహజమైన సౌందర్యం ప్రధానం గాని, ఇటువంటి వేషాలు దేనికి? వాళ్ళకి మామూలుగా వుంటే నచ్చ దనుకుంటాను. ఏం ప్రపంచమిది. బొత్తిగా మారిపోయింది."

"కబుర్లు కట్టిపెట్టి త్వరగా తెముల్చు. మీ నాన్న పిలుస్తున్నారు."

"ఇంకా అవలేదు."

"మళ్లా పిలుస్తున్నారు. ఇదిగో తీసుకు వస్తున్నా."

"ఏమండీ. రాఘవయ్యగారూ అమ్మాయి ఏమైనా చదువుకుందా?"

"మరీ ఈరోజుల్లో చదువుకున్న కుర్రాళ్లకి స్కూల్ ఫైనల్ అయినా వుండాలని బలవంతం చేస్తున్నారు గనుక, అంతవరకు చెప్పించి, మాన్పించేము."

"అంతవరకు బాగానేవుంది. అమ్మాయి కనీసం సినిమాపాటలైనా పాడుతుందా?"

"అమ్మాయీ! వారు అడిగినదానికి సమాధానం చెప్పమ్మా!"

"నాన్నా! సినిమాపాటలు పాడటమే కాదు, సినిమా ఆటలుకూడ వచ్చునా అని అడగలేదు చదువుకున్న వారుఅడగవలసినవి యివేనా? మీకు కావలసినవన్నీ అడుగుతారు. మేము అడిగేటప్పటికి సమాధానంకూడ చెప్పరు. నేనే అడుగుతున్నాను, మీకు శాస్త్రీయసంగీతం ఏమైనా వచ్చునా?"

"పేరయ్యగారూ! క్షమించండి. తలనొప్పిగా వుంది. ప్రోగ్రాము రేపటికి మార్చండి!"

"ఆడవారికి సమాధానం చెప్పలేని ఈ చదువుల అవసరం దేనికొరకు?"

"కౌసల్యా! శ్రుతిమించి రాగానపడుతున్నావు వాళ్ళంతా ఏమనుకుంటారు. నీమాటలు వినలేక వెళ్ళిపోయారు."

"వాళ్ళప్పుడే వెళ్ళిపోయారనుకుంటున్నావా నాన్నా. నిజాన్ని తెలుసుకోవాలని ప్రయత్నిస్తున్నారు. బాగా ఆలోచించి మళ్ళీ ఒక్కసారి పెళ్ళిచూపులకు వస్తారు కాఫీ టిఫిన్లు సిద్ధంచెయ్యి గడతాయని!"

"అమ్మాయీ! ఇట్లాగైతే నీ పెండ్లి కుదిరినట్లే! నీకు వచ్చిన సంబంధం ఒకటీ కూడ వుండదేమో?"

"ఎందుకు లేదు నాన్నా. మహారాజులా వుంది. నాకునచ్చిన సంబంధం మీరు చేస్తారా?"

"ఎందుకు చేయం! చెప్పమ్మా! చెప్పు!"

"మీరు చేయరని నాకు తెలుసు. చేస్తానని మీ మాటలు నిలబెట్టుకుంటే చెప్తాను."

"చెప్పు. అట్లాగే!"

"నాన్నా! మీ అక్కయ్య కొడుకు రామారావు బావను."

"ఆఁ, వాడినా! కూడు, గుడ్డకు లేనివాడిని ఇదేం కర్మం. మనదర్జాకు, మనహోదాకు ఒక పేదవాడ్ని నీవు కోరడం!"

"మీరు చూచిన సంబంధాలుకన్న ఈ సంబంధం ఎన్నోరెట్లు గొప్పది. కట్నాలు యివ్వనవసరము లేదు. చదువుకున్నవాడు. విజ్ఞానవంతుడు. పేదవాడైతే మాత్రం న్యాయంగా ధర్మంగా బ్రతికే మహాత్ముడు. అతన్ని మీరెవరూ సరిగా అర్థం చేసుకోలేక పోయారు. మనదగ్గిర డబ్బున్నంతవరకూ మనం అర్థంచేసుకోలేము. మనకు న్యాయం కనిపించదు. నాన్నా! ధనం శాశ్వతంకాదు. గుణం ప్రధానం అని మీరే అనేవారు. అవును మీకు కావలసినది బాగా డబ్బున్నవాడు... వందెకరాలు...వళ్ళంతా నిండేలా నగలు, భవనాలు, ఇంజనీర్లు, డాక్టర్లు."

"మహా గొప్పగా చెవుతున్నావుగాని, దరిద్రుడు నిన్నేం పోషించగలడు."

"మనస్సులు కలిసినపుడు, మమతలు పెరిగినపుడు, మీరు అనుకున్నంతకన్న అధికంగానే ఆదరించగలడు. నన్ను తన ప్రాణంకన్న ఎక్కువగా ప్రేమిస్తాడు."

"అందుకే కాబోలు అస్తమానం మన యింటికి వస్తున్నాడు."

"అమ్మా! అతన్ని మీరు అనుమానిస్తున్నారుగాని, అతను చాలా మంచివాడు. నన్నింతవరకూ కన్నెత్తి చూచిన పాపాన పోలేదు. నేను అతని విశాలమైన హృదయం కోసం, అతని చిన్న కళ్ళల్లోకి తొంగి చూడ్డానికి ప్రయత్నించేదాన్ని. ఒక పర్యాయం నీవు జబ్బుపడి వున్నప్పుడు, ఎక్కడో దూరంనుంచి నిన్ను చూడ్డానికి వస్తే, బావ నన్నేదో చేస్తాడని లోకులు యిష్టమొచ్చినట్లు అనుకుంటారని, అతన్ని యింటికి రానీయకుండా చేశావు అప్పటినుంచి ఎప్పుడైనా మన ఇంటికివచ్చాడా? రాలేదని నీకు తెలుసు. నే నెప్పుడైనా కనిపిస్తే నన్ను చూడకుండా ఎన్నోసార్లు వెళ్ళిపోయాడు. అతని హృదయాన్ని నీవు సరిగా అర్థం చేసుకుంటే, అప్పుడే కాదు, ఎప్పుడు కూడా అతన్ని అనుమానించవు"

"నీవు ఎన్ని చెప్పు, ఆ దరిద్రుడికి నిన్నివ్వడం కల్లో వార్త."

"అనుమానించడమే కాకుండా, పైగా అతన్ని దరిద్రుడని తిడుతున్నావా. మనకు డబ్బుందనేగా, ఒకరిమీదఅనవసరంగా నిందలు వేయడం."

"కౌసల్యా! ఏమిటా మాటలు! ఆ వంశం ఎవరికి కావాలి?"

"నాన్నా! మీరు మీఅక్కయ్యకీయవలసిన గౌరవమిదేనా? వాళ్ళవంశాన్ని దూషిస్తున్నారు మనవంశ మెటువంటిదో ఆలోచించారా? మన కుటుంబంకన్న వాళ్ళ కుటుంబం ఎన్నోరెట్లు గొప్పది. నేను పెద్దమనిషినైనప్పుడు, నీవు పుంచుకున్న "బంతిపువ్వు"ను తీసుకొనివచ్చి ఇంట్లో వుంచావు. నీవు చేసిందంతా ఏమిటినాన్నా. మన వంశం నిష్కల్మషమైనదని చెపుతున్నావుగా!"

"ఈ వేదాంతాన్ని నిన్నెవరూ చెప్ప మన లేదు." "లోకంలో జరిగే అన్యాయాలను, అక్రమాలను బయటపెడితే వేదాంతమంటారు. అనవసరంగా వాళ్ళను దూషిస్తాం. నిందిస్తాం. ఏమన్నా అంటే సంఘంలోంచి గెంటివేస్తాం. డబ్బుందని ఎన్నైనా చేయగల మనుకుంటాము. అదంతా వట్టిభ్రమ. స్వప్నం మన జీవితాలు మేడిపళ్ళని మరచిపోకు నాన్నా"

"కౌసల్యా! నీ వేమేమో చెపుతే, వాడిని నీకిచ్చి చేస్తాననుకుంటున్నావేమో!"

"అమ్మా! వివాహం చేసుకునేది మీరు కాదు నేనని తెలుస్తే మీరట్లా అనివుండరు. సంబంధం నిర్ణయించుకోటానికి, నాకు స్వాతంత్ర్యం లేనపుడు మీరు కొండమీద కోతిని తీసుకొని వచ్చినా నా కక్కరలేదు."